సాక్షి అనకాపల్లి

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



లారీని ఢీకొన్న బస్సు

లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ దుర్మరణం చెందగా, ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. 8లో



కుస్తీ పోటీల్లో పతకాలు

డీపీఎన్ జెడ్పీ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు అంతర్ జిల్లాల స్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించారు. 8లో



బిగిస్తున్న ఉక్కు పిడికిలి

ఉక్కు పిడికిలి బిగిస్తోంది. కార్మికవర్గం కదం తొక్కుతుంది. రోజురోజుకూ ఉద్యమానికి మద్దతు పెరుగుతోంది. 8లో

న్యూస్‌రీల్

మోదమ్మను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



కలెక్టర్ దంపతులు దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లిని అల్లూరి, అనకాపల్లి కలెక్టర్ దంపతులు ఏఎస్ దినేష్‌కుమార్, విజయకృష్ణన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు పాల్గొన్నారు.

ఆవ అందాలు అద్భుతం

కొండకర్ల ఆవలో ఎస్పీ దంపతుల బోటు షికారు



కొండకర్ల ఆవలో బోటు షికారు చేస్తున్న ఎస్పీ దీపికా పాటిల్ దంపతులు

అచ్యుతాపురం(మునగపాక): కొండకర్ల ఆవ అందాలు ఎంతో అద్భుతమని ఎస్పీ దీపికా పాటిల్ తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవలో ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో పాటు బోటులో షికారు చేశారు. ఆవ అందాలను చూసి మంత్రముగ్దులయ్యారు.సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో ఆవలో బోటు షికారు మంచి ఆహ్లాదాన్ని కలిగించిందని ఆమె చెప్పారు.

సప్పరం,పెద్ద పల్లకీ వాహనాలపై వెంకన్న



సప్పరం వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్ర ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సప్పరం వాహనంపై, రాత్రి పెద్ద పల్లకీ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు గోదాదేవి అమ్మవారి ఆలయంలో లక్ష్మీసహస్రనామ, అష్టోత్తరశతనామకుంకుమ పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు స్వాములు ప్రసాదాచార్యులు,కృష్ణమాచార్యులు ,శేషాచార్యులు పాల్గొన్నారు.

కి'లేడి' వలలో మరో యువకుడు

కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మద్రిపాలెం(విశాఖ): ఎన్ఆర్ఐ యువకుడికి వలపు వల వేసిన కి'లేడి'పై ఐదో పట్టణ పోలీస్ స్టేషన్(కంచరపాలెం)లో మరో బాధితుడు ఫిర్యాదు చేశాడు. మురళీనగర్ ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన కొరుప్రోలు జాయ్ జెమీమా శీలానగర్‌కు చెందిన ఎన్ఆర్ఐ యువకుడిని వేధింపులకు గురిచేసిన సంగతి తెలిసిందే. ఆమె నుంచి తప్పించుకున్న ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించడంతో జెమీమాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్ఆర్ఐ యువకుడి లాగే.. అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ యువకుడు ఆమె వలపు వలలో చిక్కుకున్నాడు. అతడితో పరిచయం పెంచుకున్న జెమీమా పలుమార్లు నగదు తీసుకుంది. మాయమాటలు చెప్పి వివాహం కూడా చేసుకుంది. ఆ తర్వాత ఆమె జాడ లేకపోవడంతో ఆ యువకుడు మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జెమీమా అతన్ని వేధింపులకు గురిచేస్తూ అందినకాడికి దోచుకుంది. నగదు ఇవ్వలేని పక్షంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను అతని భార్యకు చూపిస్తానని బెదిరించేది. దీంతో ఆమె అడిగినంత నగదును ఇచ్చేవాడు. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ యువకుడి ఘటన వెలుగులోకి రావడంతో బాధితుడు కంచరపాలెం పోలీసులను ఆశ్రయించాడు. అతని నుంచి పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ర్యాగింగే కదా.. ఏమవుతుందిలే! 8లో

హార్బర్ వ్యయ అంచనాలకు కత్తెర!

అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో నిర్మించబోయే ఫిషింగ్ హార్బర్ వ్యయ అంచనాలను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో ఎగుమతులు, హార్బర్ సామర్థ్యం, ఉపాధి అవకాశాలు, ఇతర సదుపాయాలు బాగా తగ్గిపోతాయి. హార్బర్‌లో నిలిపే బోట్ల సంఖ్య, బీచ్‌ల్యాండింగ్ ఏరియాను కూడా కుదించనున్నారు.



పూడిమడక తీరం



హార్బర్ నిర్మాణంలో గ్రీన్‌బెల్ట్ స్పేస్, ఇతర మ్యాపింగ్

గత ప్రభుత్వంలో పూడిమడక హార్బర్ నిర్మాణానికి రూ.393 కోట్లతో ప్రతిపాదనలు

- తాజాగా ప్రాజెక్టు వ్యయాన్ని రూ.300 కోట్లకు కుదించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు
- ఏటా 28,700 టన్నుల మత్స్య ఉత్పత్తుల ఎగుమతులే లక్ష్యంగా ప్రణాళికలు
- 900 బోట్లు, ట్రాలర్ల నిలుపుదలకు అవకాశం
- ఇటీవల వర్చువల్ విధానంలో పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- ఎగుమతులపై బడ్జెట్ తగ్గింపు ప్రభావం

సాక్షి, అనకాపల్లి: ఇటు వైజాగ్ హార్బర్... అటు ఒడిశాలోని పారాదీప్... మధ్యలో ఎక్కడా ఫిషింగ్ హార్బర్ లేదు. దాదాపు 200 కిలోమీటర్ల దూరం వరకు హార్బర్ లేకపోవడంతో మత్స్యకారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా తుపానులు, విపత్తులు వచ్చిన సందర్భాల్లో బోట్లను సురక్షితంగా హార్బర్‌కు తీసుకువచ్చేందుకు మత్స్యకారులు నరకయాతన పడుతున్నారు. జిల్లాకు చెందిన మత్స్యకారులు ఎక్కువగా చేపలవేటకు ఒడిశా వైపు వెళ్తుంటారు. మరోవైపు వైజాగ్‌లోనే దాదాపు 700కి పైగా మెకనైజ్డ్ బోట్లు, 3వేల ఫైబర్ బోట్లు, 400 చిన్న పడవలు ఉండడంతో ఇక్కడి హార్బర్ సామర్థ్యం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అచ్యుతాపురం మండలం పూడిమడక సమీపాన మొగ ప్రాంతంలో హార్బర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దశాబ్దాల కాలంగా ఉన్నా ఎవరూ ముందుకు రాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూడిమడకలో హార్బర్ ఏర్పాటుకు రూ.393 కోట్లతో ప్రతిపాదనలతో శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయింది. గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను నిలిపివేయడమే కాకుండా..వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధి కల్పించే పూడిమడక హార్బర్ వ్యయ అంచనాలకు కత్తెర వేసేందుకు యత్నిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల వలసలను తగ్గించడమే కాకుండా, వారి జీవనోపాధిని మెరుగుపరిచేవిధంగా పూడిమడకలో అధునాతన హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుడితే..ఇప్పుడు దాన్ని కుదించేందుకు కూటమి ప్రభుత్వం సన్నహాలు చేస్తోంది. హార్బర్ ఏర్పాటుకు 30 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కేంద్ర ఫిషరీష్ శాఖ నుంచి శాస్త్రవేత్తలు పూడిమడక వద్ద నిర్మాణం చేపట్టే ఫిషింగ్ హార్బర్ స్థలం, అక్కడ పరిస్థితులు పరిశీలించి వెళ్లారు.

వ్యాపకోస్ సంస్థ అధ్యయనం ప్రకారమే..

ఉత్తరాంధ్రలోనే రెండో అతిపెద్ద ఫిషింగ్ హార్బర్‌గా రూపొందనున్న పూడిమడక హార్బర్ పరిధి తగ్గనుంది. 2017-18 లోనే ఇక్కడ చేపల రేవు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వ్యాపకోస్ సంస్థ అధ్యయనం చేసింది. ఓడరేవు నిర్మాణంతో స్థానికంగా జరగనున్న అభివృద్ధి, నిర్మాణ, నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర నివేదికను అందించింది. ఈ నివేదిక ఆధారంగానే ప్రజాభిప్రాయసేకరణ కూడా అప్పుడు చేపట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కేంద్ర ఫిషరీష్ విభాగం నుంచి శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించి వెళ్లారు.

విశాఖ హార్బర్‌పై తగ్గనున్న భారం

పూడిమడకలో హార్బర్ నిర్మాణం పూర్తయితే విశాఖ ఫిషింగ్ హార్బర్‌పై చాలా వరకు భారం తగ్గుతుంది. వైజాగ్ ఫిషింగ్ హార్బర్ పరిధిలో 720 మెకనైజ్డ్ బోట్లు, 3వేలకు పైగా ఇంజిన్ బోట్లున్నాయి. ఏటా 5 నుంచి 10 శాతం వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. పూడిమడకలో హార్బర్ ఏర్పాటైతే చాలా వరకూ బోట్లను ఇక్కడి నుంచి ఆపరేట్ చేస్తారు. కేవలం పూడిమడక మాత్రమే కాకుండా పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, పరవాడ ప్రాంత మత్స్యకారులకు కూడా చాలా ప్రయోజనాలు కలగనున్నాయి.

కుదిస్తే..తగ్గనున్న సౌకర్యాలు

ఇప్పటికే ఢిల్లీకి చెందిన వాప్కోస్ (వాటర్ అండ్ పవర్ కన్సెల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థ సర్వే చేసి ఇక్కడి ప్రాంతం హార్బర్ ఏర్పాటుకు అనుకూలంగా ఉందని స్పష్టం చేసింది. జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడకలో 18 వేల మందికిపైగా జనాభా ఉండగా.. 16,400 మంది చేపలవేటపైనే జీవనం సాగిస్తున్నారు. నిర్మాణం పూర్తయితే వివిధ వృత్తులకు చెందిన 5వేలకు పైగా కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుంది. ఈ గ్రామ పరిధిలో మొత్తం 340 రిజిస్టర్ బోటులున్నాయి. అందుకే పూడిమడకని హార్బర్ కోసం ఎంపిక చేశారు. ఇక్కడ నిర్మించనున్న హార్బర్‌లో 930 బోట్లు నిలిపేందుకు అవకాశం ఉంది. 700 వరకూ 9 మీటర్ల మోటరైజ్డ్ బోట్లు, 200 వరకూ 18 మీటర్ల మెకనైజ్డ్ బోట్లు, 30కి పైగా 24 మీటర్ల టూనా లాంగ్ లైనర్లు ఇక్కడి నుంచి ఆపరేట్ చేసే అవకాశం ఉంది. ఏడాదికి 28వేల టన్నుల వరకూ మత్స్య సంపద నిర్వహణ సామర్థ్యం ఉండేలా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం సాగనుంది. అంచనా వ్యయం కుదిస్తే హార్బర్ సామర్థ్యం, సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోతాయి.

> మత్స్యకారులకు తీవ్ర అన్యాయం



మత్స్యకారులంటే కూటమి ప్రభుత్వానికి చులకన భావం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూడిమడకలో హార్బర్ నిర్మాణానికి రూ.393 కోట్ల వ్యయం జరుగుతుందని అంచనా వేస్తే ..దాన్ని రూ.300 కోట్లకు కుదించేందుకు కూటమి ప్రభుత్వం సన్నహాలు చేస్తోంది. ఇదే జరిగితే మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇప్పటికే కేంద్రం నుంచి సంబంధిత అధికారులు వచ్చి ఈ ప్రాజెక్టును స్థలాన్ని పరిశీలించి నివేదిక తయారుచేశారు. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద హార్బర్‌గా రూపొందనున్న పూడిమడక హార్బర్‌ను కుదించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై మత్స్యకారులందరం నిరసన వ్యక్తం చేస్తాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజుల అయింది మత్స్యకార భరోసా కూడా మంజూరు ఇవ్వలేదు.

–చోడిపల్లి శ్రీనివాసరావు, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

అంచనా వ్యయం కుదిస్తే...

	గత ప్రతిపాదనలు..	కుదించిన తరవాత
వ్యయం	రూ.393 కోట్లు	రూ.300 కోట్లు
స్థలం	30 ఎకరాలు	30 ఎకరాలు
లబ్ధి పొందే మత్స్యకారులు	16,400	15,000
ఏడాదికి సామర్థ్యం	28,000	20,000
నిలిపివే బోట్లు	930	850
తొమ్మిది మీటర్ల మోటరైజ్డ్ బోట్లు	700	600
18 మీటర్ల మెకనైజ్డ్ బోట్లు	200	150
24 మీటర్ల టూనా లాంగ్ లైనర్లు	40	30
బీచ్ ల్యాండింగ్ ఏరియా	13,176 కి.మీ	13 వేల కి.మీ
బెర్తింగ్ క్వే	771 మీటరు	700 మీటర్లు



ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుపై వాప్కోస్ సంస్థ తయారు చేసిన మ్యాప్

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు ఇంట్లో చోరీ

- రూ.1.50 లక్షల విలువ చేసే వెండి ఆభరణాల అపహరణ
- హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌లో రూ.40 వేలు చోరీ



కన్నబాబురాజు ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాంబిల్లి (యలమంచిలి): మండల కేంద్రం రాంబిల్లిలో దొంగలు రెచ్చిపోయారు. యలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఇంట్లో, ఆ ఇంటికి సమీపంలో గల హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ చేశారు. కన్నబాబురాజు భార్య పిన్నమరాజు రాధాదేవి, గ్యాస్ డీలర్ పిన్నమరాజు సంతుచేరి రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు స్వగ్రామమైన రాంబిల్లిలో గల ఆయన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తలుపులకు ఉన్న తాళం కప్పను పగలగొట్టి లోపలికి ప్రవేశించి, పూజ గదిలో ఉన్న వెండి ఉద్ధరిణి, వెండి ప్లేటు, ఇతర వెండి సామగ్రి దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుంది. కన్నబాబురాజు ఇంటికి సమీపంలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌లో కూడా చోరీ జరిగింది. తలుపుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న రూ.40 వేల నగదు, ఆఫీస్‌లో కీలక పత్రాలు, సీసీ టీవీ ఫుటేజీ మానటరింగ్ మిషన్‌ను అపహరించుకుపోయారు. అందిన ఫిర్యాదుల మేరకు రాంబిల్లి పోలీసులు, క్లూస్‌టీం సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీఐ నర్సింగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా భారతీయ వైద్యం

- డాక్టర్ ఆదిత్య రంగనాథ్ వెంపల
- 'ఆరోగ్యం–అనారోగ్యం–జాగ్రత్తలు'పై సదస్సు



డాక్టర్ ఆదిత్య రంగనాథ్ సత్కరిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: సంప్రదాయ భారతీయ వైద్యం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని కన్సల్టెంట్ పేషెంట్ కౌన్సిలర్, ఇండియన్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిత్య రంగనాథ్ వెంపల తెలిపారు. స్థానిక గవరపాలెం శ్రీగౌరీ గ్రంథాలయంలో 'ఆరోగ్యం–అనారోగ్యం–జాగ్రత్తలు'అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సంప్రదాయ వైద్య విధానాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గ్లోబల్ రిపోజిటరీని స్థాపించాలన్నారు. ప్రస్తుతం అన్ని దేశాలు ఆయుర్వేదం, సిద్ధ, యునానీ వైద్యం వైపు మొగ్గు చూపుతున్నాయన్నారు. టెలి మెడిసిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా అనలిటిక్స్ సేవలను సంప్రదాయ వైద్యంతో అనుసంధానించాలని కోరారు. యాంటీ బయాటిక్స్ విక్రయాలు, వినియోగంపై కఠినమైన నిబంధనలు ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలోనూ యాంటీ బయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టాలన్నారు. లెఫ్ట్ స్టైల్ కార్డియాక్ వైద్యురాలు దాడి జీవీఎస్ సూర్య చాందిని మాట్లాడుతూ నాడీ వ్యవస్థ ద్వారా వ్యాధుల నిర్ధారణ, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం, బలహీనమైన నాడీ వ్యవస్థ, లక్షణాలు, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. యోగ, నేచరోపతి స్పెషలిస్ట్ వైద్యురాలు దేవపల్లి ప్రత్యూష మాట్లాడుతూ యోగ, ప్రకృతి వైద్యంను విద్యా సంస్థల్లో కచ్చితంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ ఆదిత్య రంగనాథ్ వెంపలను గ్రంథాలయం కమిటీ సభ్యులు సత్కరించారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సదస్సు సమన్వయకర్త విల్లూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

- ఒకరి మృతి,ఇద్దరి పరిస్థితి విషమం
- ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమ కూలీల నివాసంలో ప్రమాదం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకనాథ్, కృష్ణారెడ్డి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర, సిబ్బంది



మృతుడు కేశవరావు (ఫైల్)

యలమంచిలి రూరల్: మండలంలోని ఫ్యూజన్ పరిశ్రమ ఆవరణలో కూలీలు నివాసముంటున్న షెడ్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ కూలీ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడుతున్నారు. యలమంచిలి మండలం లైన్ కొత్తూరు పంచాయతీ శివారులో ఫ్యూజన్ బిల్డింగ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఉంది. ఇక్కడ సిమెంట్ ఇటుకలు తయారు చేస్తారు. ఒడిశా సహా, మన రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన కూలీలు పనిచేస్తున్నారు. పరిశ్రమ ఆవరణలోనే కార్మికుల కోసం 12 రేకుల షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్‌లో ముగ్గురేసి చొప్పున కార్మికులు ఉంటున్నారు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో డ్యూటీ దిగిన బడకల కేశవరావు, లోకనాథ్, కృష్ణారెడ్డి అనే ముగ్గురు కూలీలు వంట చేసుకునేందుకు షెడ్‌లోకి వెళ్లారు. అప్పటికే వంట గ్యాస్ సిలిండర్ లీకై గ్యాస్ వ్యాపించి ఉంది. గమనించకుండా లైట్ ఆన్ చేయడంతో ఆ స్పార్క్‌కు ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ముగ్గురు కార్మికులు మంటల్లో కాలిపోతూ బయటకు పరుగులుతీశారు. వీరిని పరిశ్రమకు చెందిన కారులో యలమంచిలిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారికి చికిత్స చేసే పరిస్థితి లేదని సిబ్బంది చెప్పడంతో శీలానగర్ కిమ్స్ ఐకాన్‌కు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. 85 శాతానికి పైగా శరీరం కాలిపోవడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగకు చెందిన బడకల కేశవరావు(52)మృతి చెందాడు. మృతునికి భార్య రాజులమ్మ,కుమారులు శశి,శ్రీకాంత్, కుమార్తె ఉన్నారు.కుటుంబ పోషణ నిమిత్తం కేశవరావు పరిశ్రమలో పనిచేస్తూ ఊహించని రీతిలో ప్రాణా లు కోల్పోవడంతో కుటుంబసభ్యులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎం.లోకనాథ్,ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహానీ గ్రామా నికి చెందినవాడు.జి. కృష్ణారెడ్డి కూడా సుహానీ గ్రామం శాంతినగర్ నివాసి వీరి పరిస్థితి విషమంగా ఉంది. యలమంచిలి సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, అగ్నిమాపకాధికారి రాంబాబులు ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ధాటికి షెడ్ పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. శనివారం రాత్రే కేజీహెచ్‌కు వెళ్లిన పోలీసులు.. క్షతగాత్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

ఆ షెడ్‌లకు అనుమతులూ లేవు..

ఏడాది కిందట వీరంతా ఓ కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా ఫ్యూజన్ పరిశ్రమలో ఉత్పత్తి విభాగంలో రోజువారీ కూలీలుగా చేరారు. మెరుగైన వసతి కల్పిస్తామని నమ్మబలికి పరిశ్రమలో పనికి తెచ్చిన యాజమాన్యం, కాంట్రాక్టర్.. పరిశ్రమ ఆవరణలో ఓ మూలన నిర్మించిన రేకుల షెడ్లను గదులుగా చేసి వసతి కల్పించారు. షెడ్డులో వెంటిలేషన్ కూడా లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని చెబుతున్నారు. అయితే ఈ షెడ్లకు గ్రామ పంచాయతీ అనుమతులూ లేవని తెలిసింది. మృతుడు కేశవరావు కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ యలమంచిలి నేత చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

అంతర్ జిల్లాల కుస్తీ పోటీల్లో పతకాలు

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు అంతర్ జిల్లాల స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలను సాధించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల జరిగిన అండర్ - 17 బాలుర గ్రీకో రోమన్ స్టైల్‌లో కె.అఖిల్ 60 కిలోల విభాగంలో రజతం, 51 కిలోల విభాగంలో బి. రోహిత్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని హెచ్ఎం ఎం.ఆర్.వి అప్పారావు, ఇన్‌చార్జి హెచ్ఎం ఆచంట రవి, పీడీ వి. ప్రభాకరరావు, విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్రిన్సిపాల్ రమేష్‌కు పురస్కారం



కోరిబిల్లి రమేష్

తుమ్మపాల: సీఎస్సీ ఇండియా నీతి అయోగ్ ప్రదానం చేసే ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డు'కు పట్టణంలో దాడి వీరునాయుడు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ ఎంపికయ్యారు. ఈ నెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి ఉత్సవంలో వర్చువల్‌గా అతనికి అవార్డు ప్రదానం చేశారు. సీఎస్సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు మాట్లాడుతూ కోరిబిల్లి రమేష్ డిగ్రీ విద్యలో చేసిన దీర్ఘకాలిక కృషికి గుర్తింపుగా అవార్డు లభించిందన్నారు. ప్రిన్సిపాల్ రమేష్‌ను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

యువతులను కాపాడిన లైఫ్ గార్డ్స్



యువతులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువతులు కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన పది మంది యువతీయువకులు ఆదివారం సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు వీరు సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఇ. హర్షిత, శ్రీజ, వైష్ణవి కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ చందు, అమ్మోరు, సతీష్ గమనించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వారికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

ర్యాగింగే కదా.. ఏమవుతుందిలే!

'డియర్ స్టూడెంట్స్.. ర్యాగింగ్ అనేది శృతి మించకూడదు. ఇకపై ఎవరూ ర్యాగింగ్ చేయకూడదు. ఒకవేళ ఎవరైనా పొరపాటున చేసినా.. చూసీచూడనట్లు సర్దుకుపోవాలి కదా.. మీకు మరీ అంత ఇబ్బందిగా అనిపిస్తే.. మా దృష్టికి తీసుకురండి.. అంతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించండి. లేదంటే.. తెలుసుకదా..' ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ కారణంగా.. బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న బాధిత విద్యార్థినులతో ప్రొఫెసర్లు చెప్పిన మాటలివీ.

ఒక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ భూతం కోరలు చాస్తుంటే నిలువరించేందుకు జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి బాధిత విద్యార్థులకే హెచ్చరికలు జారీ చేయడం ఏయూకే చెల్లింది.



- సర్దుకుపోవాలంటూ విద్యార్థులకు కొందరు ప్రొఫెసర్ల క్లాస్
- 15 రోజులు సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్న కమిటీ
- చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని విద్యార్థుల ఆవేదన

సాక్షి, విశాఖపట్నం : గత కొన్నేళ్లుగా ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా నిలిచిన ఏయూలో ర్యాగింగ్ భూతం మళ్లీ పేట్రేగుతుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఏయూలోని ఆర్కిటెక్చర్ విభాగ సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తూ ర్యాగింగ్‌కు పాల్పడ్డమే ఇందుకు నిదర్శనం. రోజురోజుకు సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ పర్వం శ్రుతిమించుతుండటంతో జూనియర్ విద్యార్థులు మానసికంగా కుంగిపోయారు. డ్యాన్స్ చెయ్యండి.. అని అడగడం.. డ్యాన్స్ రాదని జూనియర్లు చెబితే.. వెళ్లి.. అబ్బాయిల దగ్గర నేర్చుకొని డ్యాన్స్ చెయ్యండి అంటూ వారిని చిత్రహింసలకు గురిచేశారు. కేవలం హాస్టల్‌లోనే కాకుండా క్లాస్ రూమ్‌లలోనూ ర్యాగింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియర్ల ఆగడాలను తట్టుకోలేక తల్లిదండ్రులు, సన్నిహితులకు ఫోన్లు చేసి.. తమ మానసిక ఆందోళన గురించి చెప్పుకోవడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది.

తూతూ మంత్రంగా విచారణ

ర్యాగింగ్ వ్యవహారం బయటికి రావడంతో ఏయూ అధికారులు హడావుడి చేశారు. పలుమార్లు ప్రొఫెసర్లు, వీసీ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని అధికారులు 'సాక్షి'లో కథనం ప్రచురితమవ్వడంతో స్పందించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించి 15 రోజులు సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. డ్యాన్స్‌ల వీడియోలు ఎవరి ఫోన్ నుంచి ఫార్వర్డ్ అయ్యాయి.. ఎవరెవరికి ఫార్వర్డ్ చేశారు.. ఇలా.. ఏ కోణంలోనూ విచారణ చేపట్టకుండా బాధిత విద్యార్థుల నుంచి సమాచారం తీసుకొని.. గుర్తించిన వారిపై సస్పెన్షన్ వేటు వేసేశారు. అయితే కేవలం ఆర్కిటెక్చర్ విభాగంలో మాత్రమే బయటికి వచ్చినా.. మిగిలిన విభాగాల్లోనూ ఇటీవల ర్యాగింగ్ జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా ఏయూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

బయటికి పొక్కకూడదు.. తస్మాత్ జాగ్రత్త

ఏయూలో ర్యాగింగ్ నిరోధానికి మూడంచెల కమిటీ పనిచేస్తోందా..? నిద్ర నటిస్తోందో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ ర్యాగింగ్ ఘటన బయటకు రావడంతో కొందరు అధికారులు విద్యార్థులతో సమావేశమై.. ర్యాగింగ్ శృతి మించకూడదు. స్నేహపూర్వకంగా ఉండాలనీ.. ఒకవేళ ఇబ్బందిగా అనిపిస్తే.. నేరుగా తమ దృష్టికి తీసుకురావాలే తప్ప బయటకు వెళ్తే పద్ధతిగా ఉండదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఏయూ అధికార యంత్రాంగం వైఖరితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామనీ.. హాస్టల్ వద్ద చాలా ఇబ్బందికరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యవహారంపై సీరియస్‌గా ఉండాలనీ.. భవిష్యత్తులో మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన సూపర్ లగ్జరీ బస్సు

- ఆర్టీసీ బస్సు డ్రైవరు దుర్మరణం
- ఏడుగురు ప్రయాణికులకు గాయాలు
- కశింకోటలో ఘటన



మృతి చెందిన బస్సు డ్రైవర్ జగన్మోహనరావు



బస్సు డ్రైవర్ జగన్మోహనరావు(ఫైల్)

కశింకోట: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆదివారం వేకువజామున కశింకోట శివారులో జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు విశాఖపట్నం వెళ్తోంది. కశింకోట శివారులోకి రాగానే, ఒక లారీ అవతలి రోడ్డుకు వెళ్లడానికి మలుపు తిరుగుతోంది. దీని ముందు ఆగి ఉన్న మరో లారీ కనిపించకపోవడంతో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్సు ముందు భాగం నుజ్జు అయింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం ఎల్లపాకూరు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ గుత్తిలి జగన్మోహనరావు (50) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బస్సులోని ఏడుగురు ప్రయాణికులు గాయపడగా, 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన వారు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. బస్సులోని మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించారు. మరికొందరు వారికి వారే వెళ్లిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షునిగా గణేష్



జిల్లా నూతన కార్యవర్గంతో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య

అనకాపల్లి: ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షునిగా బోని గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక విజయరామరాజుపేటలోని మాధవసదన్ హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా మైలపల్లి పోతురాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా గంగాధర్ మరియమ్మ యోగిరాజు, కార్యదర్శులుగా కొల్లి చినప్పారావు, కోన అప్పారావు, దొమ్మంగి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా జల్లూరి రామకృష్ణ, గాడి ప్రసాద్, గుమ్మాల అమ్మతల్లి, సోమేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కారు అప్పారావు, కోరిబిల్లి జగదీష్, పతివాడ పవన్, సత్యాడకాలి బండ క్రాంతి, ఓలుమరక ఈశ్వరరావు, సర్మండలవ రాజు, పొన్నపు రాజులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల నుంచి క్రైస్తవ మతం మారిన వారిని బీసీ సీలుగా గుర్తించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఉప కులాల వారు ప్రభుత్వం అందించిన విద్య, ఉద్యోగం, ఉపాధి కోల్పోతున్నారని, నేటికీ గ్రామాల్లో నిరుపేదలగానే జీవిస్తున్నట్లు వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని గౌరవించి నిజమైన దళితుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

బిగిస్తున్న ఉక్కు పిడికిలి



కూర్మన్నపాలెం నుంచి వడ్లపూడి వరకు మానవహారంగా ఏర్పడిన కార్మికులు

- కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కదం తొక్కుతున్న కార్మికవర్గం
- మానవహారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికులు



మానవహారంలో పాల్గొన్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు



జాతీయ రహదారిపై రాస్తారోకో అడ్డుకుంటున్న పోలీసులు

అగనంపూడి: ఉక్కు పిడికిలి బిగిస్తోంది. రోజురోజుకూ ఉద్యమానికి మద్దతు పెరుగుతోంది. స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కార్మికవర్గం కదం తొక్కుతుంది. ఇందులో భాగంగా ఆదివారం ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు అగనంపూడి నుంచి గాజువాక వరకు మానవహారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్మికులు మానవహారంలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం వైఖరిని ఖండించారు. పెద్ద ఎత్తున పోలీసులు, కేంద్ర బలగాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. రాస్తారోకోలు, ధర్నాలు జరగకుండా వారించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి సంఘీభావంగా వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఉక్కు ఉద్యమకారుడు బిషాయ్ కాళికాదేవి అవతారంలో పాల్గొని ఉద్యమకారులను ఉత్సాహ పరిచాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 87వ వార్డు పార్టీ నాయకులు మానవహారంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

అగనంపూడి కూడలిలో...

అగనంపూడి కూడలిలో నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. తరువాత మానవహారం చేపట్టారు. పోరాట కమిటీ నాయకులు జి.బోసుబాబు, విళ్లా రామ్మోహన్‌కుమార్, పెదిరెడ్ల హరనాథ్, నీలకంఠం, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చిన మానసికరోగి



తల్లి బిడ్డను టీఎస్ఆర్ వుమెన్ షెల్టర్ నిర్వాహకులకు అప్పగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

సీతమ్మధార: ఏయూటీడీ చొరవతో ఒడిశాకు చెందిన జాస్మిన్ ఓ చిన్నారికి జన్మనిచ్చింది. రైల్వేస్టేషన్‌లో చేసిన రెస్క్యూ ఆపరేషన్‌లో పట్టుబడిన జాస్మిన్ భషిల్ల(35)కు మతిస్థిమితం లేకపోవడంతోపాటు గర్భవతి కావడంతో జూన్ 8న ఏయూటీడీ నిర్వాహకులు ఆశీలమెట్టలోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల షెల్టర్‌లో ఆశ్రయమిచ్చి ఆమె బాగోగులు చూసుకున్నారు. అనంతరం ఆగస్టు 20న వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా సెప్టెంబర్ 19న వైద్యులు శస్త్రచికిత్స చేశారని సంస్థ ప్రతినిధి జ్యోతిర్మయి తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, హెచ్‌వోడీ డాక్టర్ ఉషారాణి, డాక్టర్లు సంధ్యదేవి, సత్యకళ, హర్షిత, స్టాఫ్ నర్సు సూర్యకుమారి సమక్షంలో ఏయూటీడీ సిబ్బంది లీలావతి, ప్రశాంత్, షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయికి తల్లీబిడ్డను ఆదివారం అప్పగించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ అందరినీ అభినందించినట్లు షెల్టర్ సెక్రటరీ ప్రగడ వాసు తెలిపారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో విస్తృత తనిఖీలు



రైల్వేస్టేషన్ ప్రాంతాలలో తనిఖీలు చేస్తున్న తూర్పు ఏసీపీ లక్ష్మణరావు, సీఐ విజయకుమార్



రైల్వేస్టేషన్ బయట బ్యాగులు తనిఖీలు చేస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. తూర్పు ఏసీపీ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో డాగ్ స్క్వాడ్, డ్రగ్స్ టెస్టింగ్ కిట్లతో స్టేషన్ ఆవరణ, అవుట్ గేటు, బస్టాప్ వద్ద అణువణువూ తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేసి.. అనుమానాస్పదంగా కనిపించిన వారి వివరాలు సేకరించారు. ద్విచక్ర వాహనాలు తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. ఎస్ఐ ప్రమిలా, సిబ్బంది పాల్గొన్నారు.

కాకులకున్న కనీస జ్ఞానం లేకపోతే ఎలా..

ఆలోచింపజేసిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక



జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



స్వప్నం రాల్చిన అమృతం నాటికలో ప్రదర్శన దృశ్యం

అనకాపల్లి: కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవ పోటీల్లో భాగంగా కరీంనగర్ చైతన్య భారతి వారిచే ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ఆహూతులను ఆలోచింపజేసింది. ఒక కాకికి దెబ్బతగిలి కిందపడిపోతే అన్ని కాకులు చుట్టూ చేరి కావ్.. కావ్.. అంటూ అరుస్తాయి. వాటి మధ్య ఏ బంధాలు, సంబంధాలు లేకపోయినా సరే సాటి కాకులుగా గొప్ప సానుభూతిని చూపిస్తాయి. భార్యాభర్తల బంధానికి అనుబంధానికి విలువనిచ్చే మనుష్యులం... ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా... అని సందేశాత్మక రీతిలో చాటిచెప్పింది. ''స్వప్నం రాల్చిన అమృతం'' నాటిక... దీనికి రచన పి.శివరామ్, దర్శకత్వం మంచాల రమేష్, సంగీతం సురభి నాగరాజు అందించారు.

మహిళల అన్యాయాన్ని ఎలుగెత్తి చెప్పిన...'మూల్యం''

హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారిచే ''మూల్యం'' నాటిక మహిళల అన్యాయాన్ని ఎలుగెత్తి చెప్పింది. నేటి మన సమాజంలో ఆడపిల్లల మీద అడుగడుగునా రకరకాల ఆంక్షలు విధింపబడుతున్నాయి. జననంతో మొదలుకొని పెంపకం, చదువులు, పెళ్లి, ఉద్యోగం, స్వేచ్ఛ, దృష్టి, దృక్పథం, అన్నిటా చిన్నచూపే.. వివక్షే... ఇవి చాలదన్నట్లు వివాహం అవగానే మహిళ శరీరం మీద.. శరీరాంగాల మీద ఆమె భర్తకు సర్వాధికారాలు సంక్రమిస్తాయనడం నిస్సందేహంగా అన్యాయమే... వివక్షే... మహిళను సాటి మనిషిగా గుర్తించకపోవడం, గౌరవించకపోవడం నిజంగా అకృత్యమే.. అమానుషమే.. మగవారితో సమానంగా అన్ని రంగాల్లోనూ భుజం భుజం కలిపి నడుస్తూ విజయబావుటా ఎగురవేస్తున్న మహిళా శక్తిని కించపరచడమే అవమానించడమే... లింగ అసమానతను, దుర్విచక్షణ, హక్కుల హననాన్ని నేటి మహిళ ఎలా సహిస్తుంది.. మరి ఎలా భరిస్తుంది... అలాంటి ఒక దారుణ వివక్షకు వ్యతిరేకంగా ఒక వివాహిత శంఖారావం చేసి, తన హక్కును నిరూపించుకుని మరీ సాధించిన ఒక అపూర్వ ఘటనే ''మూల్యం'' నాటిక విశేషంగా ఆకట్టుకుంది. దీనికి రచన సింహప్రసాద్ అందించగా, దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ వహించారు. స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మ శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం మళ్ల జగన్నాథరావు కల్యాణ మండపంలో ఆహ్వాన నాటకోత్సవ పోటీలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో స్నానాలు చేసేందుకు పోటీ పడ్డారు.ఉమ్మడి విశాఖపట్నం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో ఈ ప్రాంతం రద్దీగా కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులు జలకాలు ఆడుతూ ఆట పాటలతో ఉత్సాహం గడిపారు. జలపాతం వద్ద నిర్మించిన షెడ్లు, జీడిమామిడి తోటల్లో సంహపంక్తి భోజనాలు చేశారు. తర్వాత తాండవ రిజర్వాయర్‌ను చూసేందుకు సందర్శకులు తరలివచ్చారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం ప్రమాదస్థాయిలో ఉండడంతో నీటిలోకి ఎవరూ దిగకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

మొదటి యూనిట్‌కు త్వరితగతిన మరమ్మతులు

సీలేరు: స్థానిక జల విద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్‌కు మరమ్మతు పనులు వేగవంతం చేయాలని చీఫ్ ఇంజనీరు వాసుదేవరావు ఆదేశించారు. ఆదివారం ఇక్కడికి వచ్చిన ఆయన మొదటి యూనిట్ ఎప్పట్లోగా అందుబాటులోకి వస్తుందన్న విషయాన్ని అభిరామ్ కంపెనీ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం కంట్రోల్ రూమ్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. మిగతా యూనిట్ల పనితీరుపై ఆయన ఆరా తీశారు. మొదటి యూనిట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈఈ రాజేంద్రప్రసాద్‌కు ఆదేశించారు. పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఫార్సుల సర్వేయర్లు

- ఏసీబీ కేసులు ఉన్న వారికే జీవీఎంసీలో పోస్టింగ్‌లు
- కూటమి ప్రజా ప్రతినిధులతో బేరసారాలు
- పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు
- ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఇంకా చేరని సర్వేయర్లు

మహారాణిపేట(విశాఖ): సర్వేయర్ల బదిలీల ప్రక్రియపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారదర్శకతకు దూరంగా బదిలీలు జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తీవ్ర ఆరోపణలు, ఏసీబీ కేసుల ఉన్న వారికి జీవీఎంసీలో పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిడి, సిఫార్సుల మేరకు ఈ బదిలీలు జరిగాయని.. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా.. కొంత మందికి ప్రాధాన్యం లేని చోట్ల పోస్టింగ్ రావడంతో వారు ఇంకా విధుల్లో చేరకపోవడం గమనార్హం. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వే పనులకు విఘాతం కలుగుతోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 118 మంది సర్వేయర్లకు బదిలీలు జరిగాయి. కీలకమైన పెందుర్తి, ఆనందపురం, భీమిలి, గాజువాక, అనకాపల్లి, సబ్బవరం, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి తదితర మండలాల్లో సర్వేయర్ల పోస్టులు ఎక్కడా లేని ధర పలికాయి. ఇక్కడ పోస్టింగ్ దక్కించుకోవడానికి సర్వేయర్లు పోటీ పడ్డారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు సిఫార్సులు ఉంటే గాని పోస్టింగ్ రావడం లేదని తెలిసిన సర్వేయర్లు వారితో బేరసారాలకు దిగారు. కాగా.. జీవీఎంసీ పరిధిలోని ఏడు సర్వేయర్ల పోస్టుల్లో.. నాలుగు పోస్టింగుల మీద విమర్శలు వస్తున్నాయి. ఆరోపణలు, ఏసీబీ కేసులు ఉన్న వారికి ఇక్కడ పోస్టింగులు ఇవ్వడం మీద చర్చనీయాంశమైంది. అలాగే పెందుర్తి సర్వేయర్ నియామకం మీద కూడా ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ పోస్టింగులు అన్ని అనుకున్న ప్రకారం జరిగిపోయాయి. అలాగే వారు విధుల్లో కూడా చేరిపోయారు. ఇదిలా ఉండగా కొంత మందికి ప్రాధాన్యం లేని పోస్టింగులు వచ్చాయి. అంటే అక్కడ డబ్బులు పెద్దగా రావు అన్నమాట! అలాంటి పోస్టింగుల్లో సర్వేయర్లు ఇంకా విధుల్లో చేరలేదు. ఇంకా రిలీవ్ చేయలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. బదిలీలు జరిగి 13 రోజులు దాటుతున్న ఇంకా విధుల్లో చేరలేదు. దీంతో వివిధ పనుల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వేయర్ ఇంకా విధుల్లో చేరలేదని చెప్పి వెనక్కి పంపుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- మంత్రి దుర్గేష్



బొర్రా గుహలకు వచ్చిన మంత్రి దుర్గేష్

అనంతగిరి (అరకులోయ రూరల్): పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆశాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆదివారం ఆయన బొర్రా గుహలు, తైడా పర్యాటక కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 2.0లో భాగంగా బొర్రా గుహలను రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. బొర్రా గుహల నుంచి పంచాయతీకి రావాల్సిన 20 శాతం వాటాకు సంబంధించి రూ.8కోట్లు బకాయి ఉందని, ఈ మొత్తాన్ని తక్షణం ఇప్పించాలని సర్పంచ్ అప్పారావు కోరారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మావూరు రాంప్రసాద్ షష్ట్యబ్ది ఉత్సవ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో "రామాయణంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు పరిరక్షణ సమితి కన్వీనర్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. వ్యాసరచన పోటీలకు 125 మంది విద్యార్థులు, వక్తృత్వ పోటీలకు 80 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. దసరా సెలవుల్లో ఇంతమంది విద్యార్థులు హాజరవడం అభినందనీయమన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలకు గవరపాలెం శంకర్ కాలనీ హిమశేఖర్ పాఠశాల ఆవరణలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. విజేతల సెల్‌ఫోన్‌కు సమాచారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు జి.రంగబాబు, తమ్మిరాజు, మాధవీ సనారా, పి.అమరజ్యోతి, కోరాడ అప్పలరాజు, సి.ఎల్.ఎన్.శాస్త్రి, బి.వి.సూర్యనారాయణరావు, జి.ఎస్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ గర్జన విజయవంతం చేయండి



బీసీ గర్జనపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న సూదికొండ మాణిక్యాలరావు

తుమ్మపాల: బీసీ కుల జన గణన కోసం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 9న జరగనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. పట్టణంలో బీసీ సంఘాల నేతలను కలిసి కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురవుతున్న బీసీ వర్గాల హక్కులను కాపాడుకునేందుకు, బీసీ కులాల ప్రజల వాస్తవ సంఖ్య స్పష్టమయ్యేందుకుగాను, తద్వారా రాజ్యాంగం అందిస్తున్న రిజర్వేషన్ ఫలాలు బీసీలకు దక్కాల్సిన వాటా పొందేందుకుగాను, బీసీ కుల జన గణన తప్పక జరగాలన్నారు. ఇందుకోసం బీసీ కులాలు అన్ని ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బీఎస్పీ నాయకుడు వనమాల నాగభూషణం పాల్గొన్నారు.

దళిత రైతుల ఆందోళన

పరవాడ: పెదముషిడివాడలో దళితులకు ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్‌లోని స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని కోరుతూ దళిత రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. వీరికి జనసేన, బీజేపీ నాయకులు మద్దతు పలికారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
రామనగర్ బన్నీ	: సత్యనారాయణ స్క్రీన్-1
మిస్టర్ సెలబ్రిటీ	: సత్యనారాయణ స్క్రీన్-2
కాళి	: పర్తిసాయి
సత్యం సుందరం	: షిర్డిసాయి
దక్షిణ	: వెంకటేశ్వర
మన్మథ	: శ్రీసత్య
శ్వాగ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 242 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 216 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

తాగునీటి కేకలు

- కశింకోటలో తీవ్ర ఇబ్బందులు ● అరకొరగా సరఫరా ● కుళాయిలున్నా.. ప్రయోజనం సున్నా ● సమస్య పరిష్కరించాలని మహిళల వేడుకోలు



కనకమహాలక్ష్మి వీధిలో అరకొరగా కుళాయి నీరు



ట్యాప్‌లు లేక ఇంటింటి కుళాయిల నుంచి వృథాగా పోతున్న నీరు



కశింకోటలో కుళాయి నీటి కోసం మహిళల నిరీక్షణ



గోతిలో కుళాయి నీరు పడుతున్న మహిళ

కశింకోట: వర్షాకాలంలోనూ **ప్రజలు తాగునీటి** సమస్యను ఎదుర్కొంటున్నారు. **కుళాయిల నుంచి** నీటి సరఫరా అరకొరగా ఉండటం, ఇంటింటి కుళాయిలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో కశింకోట పంచాయతీలో ఈ పరిస్థితి నెలకొంది. గ్రామమంతటా ఉప్పు నీరే లభ్యమవుతుండటం వల్ల తాగునీటికి కుళాయి నీరే ప్రధాన ఆధారమైంది. నీరు సరిపడగా సరఫరా కాకపోవడంతో నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

మండలంలోనే అతి పెద్ద పంచాయతీ కశింకోటలో 20 వేల జనాభా ఉంది. వీరికి 350 పబ్లిక్, ప్రైవేటు కుళాయిలు, 4 వేలు పైబడి ఇంటింటి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కశింకోటలో దాదాపుగా బావులు, బోర్ల నుంచి ఉప్పు నీరే లభ్యమవుతోంది. దీంతో ఇక్కడి శారదానది అవతల పొలాల్లో బోర్లు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా గ్రామంలోని కోటదిబ్బ వద్ద నిర్మించిన మూడు పెద్ద రక్షితనీటి పథకాల ట్యాంకులకు మంచినీరు అందించి నింపుతున్నారు. అక్కడి నుంచి గ్రామంలోని సింహ భాగానికి పబ్లిక్, ప్రైవేటు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అరకొరగానే నీరు సరఫరా అవుతుండటంతో స్థానిక గవరపేట, కనకమహాలక్ష్మి వీధి,పూసర్ల వీధి తదితర ప్రాంతాల్లో దూరంగా ఉన్న కుళాయిల వద్దకు వెళ్లి నీటి పట్టుకోవలసి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో గోతుల్లో నీరు గిన్నెలతో తోడుకొని పట్టుకోవలసి వస్తుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1500 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు లేవు..

మాలపేట, గవరపేట, కస్పావీధి తదితర ప్రాంతాల్లో సుమారు 1500 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు లేవు. వారికి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం పబ్లిక్ కుళాయిల నీరు, ఇంటింటి కుళాయిల నీరు ఒకేసారి సరఫరా చేస్తున్నారు. వేర్వేరు సమయాల్లో సరఫరా చేస్తే ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. ఇందుకు అధికారులు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అనధికారికంగా కుళాయిలకు మోటార్లు..

అనధికారికంగా కుళాయిలకు కొందరు మోటార్లు అమర్చి తోడి వేస్తుండటంతో నీరు అందని పరిస్థితి నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. సుమారు వంద వరకు మోటార్లు అమర్చి ఉన్నట్లు అధికారిక సమాచారం. వాటితోపాటు అనధికారిక కుళాయిలను తొలగించాలంటున్నారు. ఈ విషయాన్ని ఇటీవల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి స్థానికులు తీసుకు వచ్చారు. నోటీసులు ఇచ్చి కుళాయిల అనధికారిక మోటార్లు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరారు.

మెరకలో కుళాయిలకు సరఫరా కాని నీరు..

ఇక్కడి సమీపంలోని సంపతిపురం వద్ద సమగ్ర భారీ రక్షితనీటి పథకం నుంచి గ్రామంలోని ఇంటింటి కుళాయిలకు నీరు సరఫరా చేస్తున్నారు. ఇది ఎప్పుడు సరఫరా అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి. ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినప్పుడు భూస్థాయి మట్టం(లెవెల్) చూడకుండా ఇష్టం వచ్చినట్లు పైపులైన్ ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇచ్చారు. దీంతో పల్లంగా ఉన్న కుళాయిలకు నీరు సరఫరా అవుతోంది. మెరకలో ఉన్న కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదు. కొన్ని కనెక్షన్లను సరిగ్గా కలపకపోవడం వల్ల కొన్ని కుళాయిల నుంచి కూడా అసలు నీరే రావడం లేదు. అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి.

తాగేందుకు ఉపయోగపడని నీరు...

ఇంటింటి కుళాయిలకు సరఫరా చేస్తున్న నీరు తాగడానికి అనువుగా ఉండటం లేదని, దాన్ని ఇంటి వాడుకకు ఎక్కువ శాతం మంది వినియోగిస్తున్నారు. దీనివల్ల ఇంటింటి కుళాయిలకు పొలాల్లో బోర్ల ద్వారా వస్తున్న నీటినే సరఫరా చేయాలని స్థానికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రామకృష్ణ **సూచనల మేరకు వీధి** కుళాయిల వలె ఇంటింటి **కుళాయిలకు పొలాల్లో** బోరు నీటినే అదనపు ట్యాంకు ద్వారా అందివ్వడానికి, రెండు పూటలా రెండేసి గంటల వంతున నీరు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఇంకా అందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అది పూర్తిస్థాయిలోకి ఆచరణలోకి రావడానికి సమయం పడుతుందని, అవసరమైన చోట వాల్వులు ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుందని అధికారులంటున్నారు. ఇంటింటి కుళాయిల నుంచి వస్తున్న నీటిని కొందరు వినియోగించకపోవడం వల్ల రోడ్లపైన, మురుగు కాలువల్లో వృథాగా పోతోంది. ఈ కుళాయిలకు చాలా చోట్ల ట్యాప్‌లు లేవు. ట్యాప్‌లు అమర్చితే నీటి వృథాను అరికట్టడమే కాకుండా ఎత్తు ప్రాంతంలో కుళాయిలకు ఎక్కువ నీరు అందడానికి అవకాశం ఉంటుందని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ మరమ్మతులు చేసి తాగునీరందిస్తాం

కశింకోటలో రెండు రోజులుగా పబ్లిక్, ప్రైవేటు కుళాయిల నుంచి నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొందరు నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుంటుండగా, మరికొందరు గ్రామంలో లభించే ఉప్పు నీటిని, అరకొరగా వస్తున్న ఇంటింటి కుళాయి నీటితో సరిపెట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా పైపులైన్ దెబ్బతినడం వల్ల నీరు సరఫరా నిలిచిందని, మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు.

కుళాయి ఉన్నా ప్రయోజనం లేదు



ఇంటింటి కుళాయి ఉన్నా ప్రయోజనం లేకపోతోంది. నీరు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తోంది. దీంతో దూరంగా వెళ్లి ఎక్కడ వస్తే అక్కడ పబ్లిక్ కుళాయిల నుంచి తాగు నీరు తెచ్చుకోవల్సి వస్తోంది. దీని దృష్ట్యా ఇంటింటి కుళాయిల నుంచి రోజూ సరిపడ నీరు సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
– బండి రాంబాబు, పూసర్ల వీధి, కశింకోట.

పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయాలి



కుళాయిల నుంచి అరకొరగా తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో వల్ల నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
–ఆళ్ల పుష్ప, కనకమహాలక్ష్మి వీధి, కశింకోట

గోతుల్లో నీటిని పట్టుకుంటున్నాం



కుళాయిల నుంచి నీరు సరఫరా సరిగ్గా జరగక గోతుల్లో నీటిని పట్టుకోవలసి వస్తోంది. కుళాయిల నుంచి పూర్తిస్థాయిలో నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
–పెంటకోట లక్ష్మి, మేదర వీధి, కశింకోట

అరకొరగా నీరు



కశింకోటలో బావులు, బోర్ల నుంచి ఉప్పు నీరే లభిస్తుండటం వల్ల కుళాయి నీరే తాగునీటికి ఆధారం. నీరు అరకొరగా అందివ్వడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. పూర్తిగా తాగునీరు అందించి నీటి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
–కె. లక్ష్మి, కశింకోట

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గ్రీన్ క్లబ్ సభ్యులు బైక్ ర్యాలీ



జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి బైక్ ర్యాలీ చేస్తున్న గ్రీన్ క్లబ్ సభ్యులు



కర్రివారి వీధిలో మొక్కలు నాటుతున్న సభ్యులు

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలోని కర్రివారివీధి నందనవనంలో క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. జామ, పనస, వేప, కానుగ, బాదం, ఉసిరి వాటర్‌యాపిల్, కదంబ, అశోక్ వంటి వంద మొక్కలను నాటారు. అంతకుముందు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి క్లబ్ సభ్యులు బైక్ ర్యాలీగా కర్రివారి వీధికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమస్త జీవ వైవిధ్యాన్ని కాపాడుకునే బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. నేటి నుంచి కొత్తగా గృహాలు నిర్మించుకునే వ్యక్తులు రెండు మొక్కలు నాటి, పర్యవేక్షణ చేసినట్లయితే పరిశుభ్రమైన గాలిని పీల్చుకోవచ్చన్నారు. క్లబ్ సభ్యులు పాలమరశెట్టి వెంకట్, కర్రి పూర్ణచంద్రావు, కాండ్రేగుల నూకఅప్పారావు, కోయిలాడ వినయ్‌కుమార్, కాండ్రేగుల శివాజీ, విల్లూరి రాఘవ గణేష్, మురళీ పాల్గొన్నారు.

● తీరం.. ఆనంద విహారం



తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. గాజువాక, అనకాపల్లి, లంకెలపాలెం, సబ్బవరం, పరవాడ, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులతో తీర ప్రాంతాలు కళకళలాడాయి. ఉదయాన్నే చేరుకున్న సందర్శకులు తీరంలో ఆట పాటలతో సరదాగా గడిపారు. యువత డ్యాన్సులతో సందడి చేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలలో మునిగితేలారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా తీరంలో సముద్ర స్నానాలు ఆచరించి, తిరుగుముఖం పట్టారు. - పరవాడ

లలితా త్రిపుర సుందరీ దేవిగా కనకదుర్గ



కశింకోటలోని కనకదుర్గమ్మ లలిత త్రిపుర సుందరీ దేవి అవతారం



కన్నూరుపాలెంలో అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

కశింకోట: స్థానిక కనకదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చనలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాదబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానిక శివాలయాల్లో సర్వమంగళాంబ అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి సహస్ర నామార్చనతో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వి.చిదంబరం ఆధ్వర్యంలో కుంకుమార్చనలు జరిగాయి. ఈ సందర్భంగా భజనలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కన్నూరుపాలెంలో శనివారం రాత్రి భక్తులు అగ్నిగుండాలు తొక్కి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

దుర్గాదేవి పాహిమాం

- దేవాలయాల్లో అమ్మవారికి నిత్య పూజలు
- ఘనంగా కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు



నూకాంబిక బాలాలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న దేవదాయ శాఖ డీసీ సుజాత, దాడి జయవీర్



అన్నపూర్ణాదేవి అవతారంలో కనకదుర్గ



కుక్కుటేశ్వరిదేవి అలంకరణలో గౌరీదేవి



అన్నపూర్ణాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనం



అన్నపూర్ణాదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ



సత్యనారాయణపురంలో కనకదుర్గ అమ్మవారి కొండపై హోమం చేస్తున్న అర్చకులు



కామాక్షమ్మవారు ఆలయంలో కుంకుమార్చన



అమ్మవారి ఆలయంలో కలశ పూజలు చేస్తున్న డీసీ సుజాత



కన్యకాపరమేశ్వరి ఆలయంలో జానపద నృత్యాలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి: దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తెల్లవారు జాము నుంచే అమ్మవారి ఆలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగుతున్నాయి. గ్రామ గ్రామాన అమ్మవార్లకు నిత్య పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి, రాజరాజేశ్వరిదేవి, కుక్కుటేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

బాలాలయంలో విశేష పూజలు....

నూకాంబిక బాలాలయంలో గణపతి పూజ, కుంకుమార్చన నిర్వహించారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలను దేవదాయ శాఖ డీసీ ఎస్. సుజాత, గౌరీ వ్యాయామశాల అధ్యక్షుడు దాడి జయవీర్ చేపట్టారు. మధ్యాహ్నం కడిమిశెట్టి వీర సత్యనారాయణమూర్తి, రాధ, శ్రీరామ్ చిదంబరం, విజయలక్ష్మి దంపతులు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను డీసీ సుజాత ప్రారంభించారు.

అన్నపూర్ణాదేవిగా

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కుటేశ్వరీదేవిగా..

గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీదేవి కుక్కుటేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవి అవతారంలో..

స్థానిక నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ ఉపాధ్యక్షుడు కొంత్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బేడసేవ, శ్రీచక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కన్యకాపరమేశ్వరి సిరి స్పందన నృత్యాలయం, డ్యాన్స్ టీచర్ బి.గిరిజ స్పందన శిష్య బృందంచే సాయంత్రం 'శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యాలు చేపట్టారు. ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో ...

సత్యనారాయణపురంలో కనకదుర్గ కొండపైన అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్‌రావు, ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ, చైర్మన్ మేడిశెట్టి రామసత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి వెంకటరమణ కిషోర్, గౌరవాధ్యక్షుడు పలకా సత్యనారాయణ, అన్నదానం ట్రస్ట్ చైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కేంద్ర పథకాలపై ఆరా

మాడుగుల : గ్రామీణ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అమలు అవుతున్నాయా లేదా అని మండలంలో ఎం. కృష్ణాపురం, కింతలి గ్రామాల్లో ఆదివారం నేషనల్ లెవెల్ మోనిటరింగ్ (ఎన్ఎల్ఎం) బృందం సర్వే చేసింది. కేంద్ర బృంద సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ పి.శ్రీనివాస్‌లు ముందుగా ఎం. కృష్ణాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశా రు. వితంతు, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఎలా అందుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న 26 డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఎస్‌హెచ్‌సీ గ్రూపులకు అందిస్తున్న రుణాలు, రికవరీ, ఎలా ఉందని, బ్యాంకుల సహకారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నా రు. ఎస్‌హెచ్‌జీ రుణాలతో మహిళలు అభివృద్ధి చెందడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే ఎం.కృష్ణాపురం ఎస్‌హెచ్‌జీ రుణాలు పెట్టుబడితో చిరు వ్యాపారాలతో అభివృద్ధి, గొర్రెలు, మేకలు పెంపకంలాంటి విషయాల్లో ముందంజలో ఉందని, కేంద్రం అందిస్తున్న పథకాలు గ్రామాల్లో సక్రమంగా అమలవుతున్నాయని సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ వడ్డాది చారుమతీదేవి, గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, కింతలి సర్పంచ్ మైచర్ల భవానీ తదితరులు పాల్గొన్నారు.